
# ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 4 ఆగస్టు 2024


# సపరేటుగా సర్దుబాటు

జిల్లాలో వివాదాస్పదంగా మారిన తహసీల్దార్ల సర్దుబాటు అంశం ఇంకా చల్లారలేదు. కలెక్టరేట్‌లో కీలక అధికారితో పాటు ఇద్దరు ఉద్యోగులు కూడబలుక్కుని చేసిన సర్దుబాటు జాబితాపై కొందరు తహసీల్దార్లు గుర్రుగా ఉన్నారు. బదిలీల్లో ఎంత నగదు చేతులు మారింది? ఎవరెవరు ఎంతమేర చెల్లించి తాము కోరుకున్న మండలాల్లో పోస్టింగ్ తెచ్చుకున్నారనే అంశాలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ వ్యవహారం కలెక్టరేట్ ఉద్యోగుల్లో తీవ్ర చర్చకు దారితీయడం, పంచాయితీ ఎమ్మెల్యేల వద్దకు చేరడం, వారు వివరాలు రాబట్టడంతో సర్దుబాటు అంశం సీరియస్‌గా మారింది.

## తహసీల్దార్ల బదిలీల్లో చక్రం తిప్పిన కీలక అధికారి

## తెరవెనుక ఇద్దరు ఉద్యోగుల హస్తం

- భారీగా నగదు వసూలు చేశారనే ఆరోపణలు
- ఇంకా విధుల్లో చేరని చాలామంది తహసీల్దార్లు
- ఆ ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- వివరాలు రాబడుతున్న టీడీపీ కూటమి నాయకులు
- దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయిన కీలక అధికారి
- మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసేందుకు తహసీల్దార్ల యోచన

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** జిల్లాలో తహసీల్దార్ల సర్దుబాటు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఇందులో జిల్లాకు చెందిన కీలక అధికారి ముఖ్యపాత్ర పోషించగా, కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగితో పాటు మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే మరో ఉద్యోగి తెరవెనుక చక్రం తిప్పారు. తాను త్వరలో ఒక మంత్రికి పీఏగా వెళ్తున్నానని, తాను చెప్పినట్టుగానే తహసీల్దార్ల సర్దుబాటు ప్రక్రియ నడుస్తుందని చెప్పిన ఆర్డీవో కార్యాలయంలోని ఓ ఉద్యోగి తనదైనశైలిలో వ్యవహారం నడిపినట్లు కలెక్టరేట్ ఉద్యోగులు చెప్పుకొంటున్నారు. కలెక్టరేట్‌లోని ఆరు సెక్షన్లకు సూపరింటెండెంట్లుగా పోస్టింగ్‌లు ఇచ్చిన తహసీల్దార్లలో ఒకరు మాత్రమే విధుల్లో చేరారు. మిగిలినవారు, వారికి కేటాయించిన పోస్టుల్లో చేరేందుకు సుముఖంగా లేరు. వారు తమకు కేటాయించిన పోస్టుల్లో చేరతారా, లేదా అనేది సోమవారం మధ్యాహ్నానికి గానీ తెలియని పరిస్థితి. సర్దుబాటులో కీలకంగా వ్యవహరించిన కలెక్టరేట్‌లో, ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగుల వ్యవహారశైలిపైనా కూటమి నాయకులు గుర్రుగానే ఉన్నారు. ఎమ్మెల్యేల సిఫార్సులను సైతం పక్కనపెట్టి తమదైనశైలిలో నగదు వసూళ్లకు పాల్పడిన వీరి గురించి కూటమి నాయకులు ఆరా తీస్తున్నారు. పామర్రు, గూడూరు, పెడన, కోడూరు, బంటుమిల్లి, గుడ్లవల్లేరు తదితర మండలాల్లో తహసీల్దార్ల సర్దుబాటులో జరిగిన అవినీతిపై కొందరు తహసీల్దార్లు పూర్తిస్థాయిలో సమాచారం రాబట్టి శాసనసభ్యులకు, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగికి, తహసీల్దార్ల సర్దుబాటు ప్రక్రియకు సంబంధం ఏమిటనే అంశంపైనా కూటమి నాయకులు వివరాలు రాబట్టే పనిలో ఉన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారి, ఇద్దరు ఉద్యోగుల పనితీరుపై పూర్తిస్థాయి విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కూడా తహసీల్దార్ల నుంచి వినిపిస్తోంది.

### కీలక అధికారి జిల్లాకు రానట్టేనా..?

తహసీల్దార్ల సర్దుబాటు ప్రక్రియలో పెద్దమొత్తంలో నగదు పోగేసుకుని దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన కీలక అధికారి ఇక జిల్లాకు వచ్చేది లేదని, సెలవులో ఉన్న ఆయన అటు నుంచి అటే వేరే జిల్లాకు వెళ్లిపోతారని కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులతో పాటు రెవెన్యూ అసోసియేషన్ నాయకులు సైతం చెప్పుకొంటున్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులతో, అధికారులతో పనిచేయించుకుని, వారికి ఎన్నికల విధుల నిమిత్తం ఇవ్వాల్సిన నగదును ఇవ్వకుండా మిన్నకుండిపోయిన ఈ అధికారి తహసీల్దార్ల సర్దుబాటులో మాత్రం పెద్దమొత్తంలో మూటగట్టుకుని వెళ్లిపోయారని, ఇక జిల్లాకు రాకపోవచ్చని ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకొంటున్నారు.

### మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసే యోచన

జిల్లాలో తహసీల్దార్ల సర్దుబాటులో జరిగిన అక్రమాలను కొందరు తహసీల్దార్లు ఇప్పటికే శాసనసభ్యులకు, కూటమి నాయకులకు వివరించారు. అంతటితో ఆగకుండా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పనిచేస్తున్న కీలక అధికారి పనితీరు, సర్దుబాటులో జరిగిన తప్పులను సరిదిద్దకపోతే లోకేశ్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని కొందరు తహసీల్దార్లు చెబుతున్నారు. ఈ వ్యవహారం సోమవారం తరువాత ఎన్ని మలుపులు తిరుగుతుందోనని రెవెన్యూ విభాగం ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.




యామినీ కృష్ణమూర్తి మృతితో కన్నీరు పెట్టుకున్న కూచిపూడి గ్రామం

## 1960లోనే కూచిపూడిలో శిక్షణ పొందిన కళాకారిణి

## అనేకసార్లు కూచిపూడి నాట్యోత్సవాలకు రాక



కూచిపూడి నాట్యాచార్యులు పీవీజీ కృష్ణశర్మను సత్కరిస్తున్న యామినీ కృష్ణమూర్తి (ఫైల్)

ఆమె సిరిసిరిమువ్వలు నెమలికి నాట్యం నేర్పిస్తాయి. గమకాల నాదవినోదానికి తన నాట్య విలాసంతో గమనాన్ని జతచేసి ఆమె వేసే ప్రతి అందె ఆహుతులను ఆనందింపజేస్తుంది. భరతనాట్యకారిణిగా, కూచిపూడి కళాకారిణిగా ఖండాంతరాల్లో తన ఖ్యాతిని ఇనుమడింపజేసుకున్న యామినీ కృష్ణమూర్తికి కృష్ణాజిల్లాపై మక్కువ ఎక్కువ. స్వతహాగా భరతనాట్య కళాకారిణి అయినప్పటికీ కూచిపూడి నాట్యంపై ఇష్టంతో 1960లోనే ఇక్కడికి వచ్చారు. కూచిపూడి నాట్యానికి పుట్టినిల్లైన కూచిపూడిలో నాట్యాచార్యులు చింతా కృష్ణమూర్తి, సంగీత కళానిధి పీవీజీ కృష్ణశర్మ వద్ద శిక్షణ పొందారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం వద్ద కూడా కూచిపూడిలో మెళకువలు నేర్చుకున్నారు. శ్రీసిద్ధేంద్ర కళాపీఠంలో జరిగిన కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ బృంద భామా కలాపంలో యక్షగానాన్ని చిత్రీకరించారు. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి అంశాలను ప్రదర్శించి అంతులేని కీర్తిని సముపార్జించారామె. కూచిపూడిలో జరిగిన నాట్యోత్సవాల్లో అనేకసార్లు పాల్గొన్నారు. ఇక్కడి కళాకారులతో ప్రత్యేక అనుబంధాన్ని కొనసాగించారు. యామినీ కృష్ణమూర్తి మృతి వార్తతో కూచిపూడి గ్రామం కన్నీరు పెట్టుకుంది. కళారంగానికి తీరని లోటని నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. - కూచిపూడి

బెజవాడకు జంబో ఫ్లై ఓవర్ రానుంది. అలాగే, ఈస్ట్ బైపాస్ సాకారం కానుంది. అతిపెద్ద ఏడు కిలోమీటర్ల నిడమానూరు ఫ్లై ఓవర్‌కు, ఈస్ట్ బైపాస్‌కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. విజయవాడ నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చే ఈ రెండు కీలక ప్రాజెక్టులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి.

# కల సాకారం



మహానాడు-నిడమానూరు జాతీయ రహదారి

## మహానాడు-నిడమానూరు ఫ్లై ఓవర్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- రూ.800 కోట్లతో రెండున్నరేళ్లలో పూర్తి
- విజయవాడ తూర్పు బైపాస్‌కు అంగీకారం
- రూ.2,716 కోట్లతో మూడున్నరేళ్లలో పూర్తి
- వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభం
- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వెల్లడి

**(విజయవాడ-ఆంధ్రజ్యోతి) :** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న విజయవాడ తూర్పు బైపాస్‌కు, మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని శనివారం కేంద్రం ఆమోదించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఆరు లైన్ల ఫ్లై ఓవర్‌కు అనుమతి లభించిందని, దీనికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) కూడా దాదాపు సిద్ధమైందన్నారు. రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నారని, ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ప్రారంభిస్తారన్నారు. రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.800 కోట్లు అని పేర్కొన్నారు. ఈ నిర్మాణం పూర్తయ్యేలోగా రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు రేడియల్ రోడ్లు నిర్మిస్తారన్నారు. దీంతో పాటు విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణం కూడా వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభమవుతుందని చిన్ని చెప్పారు. తూర్పు బైపాస్ నిర్మాణానికి రూ.2,716 కోట్ల వరకూ ఖర్చవుతుందని, త్వరలో జాతీయ రహదారి అధికారులు రివైజ్డ్ డీపీఆర్‌ను సిద్ధం చేస్తారని చెప్పారు. మూడున్నరేళ్లలో తూర్పు బైపాస్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. అమృత్ పథకం కింద విజయవాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారని, త్వరలోనే నిధులు విడుదలవుతాయన్నారు. అమరావతికి రైల్వేలైన్ రావడం సంతోషదాయక విషయమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేసేదే కూటమి ప్రభుత్వమని, అందుకే కేవలం 40 రోజుల్లోనే అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లను కేంద్రం అందించిందన్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు మార్క్ అని పేర్కొన్నారు.

### బెజవాడ ట్రాఫిక్‌కు చెక్

మహానాడు ఫ్లై ఓవర్, విజయవాడ ఈస్ట్ బైపాస్‌తో బెజవాడ ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. విజయవాడ నుంచి నిడమానూరు వెళ్లే మార్గంలో ప్రభుత్వాసుపత్రి జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, ఇన్నర్‌రింగ్ జంక్షన్, ప్రసాదంపాడు, ఎనికేపాడు వరకు మొత్తం కలిపి 27 ట్రాఫిక్ జంక్షన్ పాయింట్లు ఉన్నాయి. అలాగే, ప్రస్తుతం ఎన్‌హెచ్-16 నాలుగు వరసలతో ఉంది. హైవేను ఆనుకుని నగర శివారు విస్తరించి ఉంది. అడుగడుగునా హైవేకు అనుసంధానంగా లోపలికి రోడ్లు ఉంటాయి. వాహనాల రాకపోకలతో మాటిమాటికీ ట్రాఫిక్ ఆగిపోతోంది. ఈ ప్రాంతాలను ఆనుకుని సమీపంలో ఆటోనగర్‌కు వెళ్లే ప్రధాన మార్గాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు చెప్పనలవి కావు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రధానమార్గం కావటం వల్ల ఇక్కడ ట్రాఫిక్‌ను తగ్గించాల్సిన అవసరం ఉంది. నిడమానూరు ఫ్లై ఓవర్ దీనికి చక్కటి పరిష్కారం.

### నాటి అలైన్‌మెంట్ మేరకే తూర్పు బైపాస్

విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణ ప్రతిపాదన 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఊపిరిపోసుకుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా రూపుదిద్దుకున్నాయి. నాలుగు వరసల్లో రూపుదిద్దుకోనున్న ఈ బైపాస్ సుమారు 50 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. కృష్ణాజిల్లా చినఅవుటపల్లి నుంచి గుంటూరు జిల్లా కాజా వరకు ఈ బైపాస్‌ను నిర్మించనున్నారు. నిర్మాణ వ్యయం రూ.2,716 కోట్లుగా అంచనా వేశారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే భారీ వాహనాలు నగరంలో ప్రవేశించే అవకాశం లేకుండా ఉంటుంది. దీంతో నగరంలో చాలావరకు ట్రాఫిక్ రద్దీ తగ్గిపోతుంది.

# కాల్వకట్టకు గండి

## ఏనుగులకోడు డ్రెయిన్‌లోకి పోతున్న సాగునీరు

**తోట్లవల్లూరు, ఆగస్టు 3 :** పెనమకూరు వద్ద బందరు కాల్వకట్టకు గండిపడింది. ఫలితంగా రెండు రోజుల నుంచి సాగునీరు ఏనుగులకోడు డ్రెయిన్‌లోకి వృథాగా పోతోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం గండిపూడ్చే పనులు చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఇసుకను తెచ్చి సిమెంటు సంచుల్లో నింపి అడ్డుకట్ట వేసినా ప్రయోజనం లేకుండాపోయింది. మూడు ట్రక్కుల్లో తెచ్చిన ఇసుక కట్టలు అడ్డువేసినా గండి ఆగలేదు. కాగా, శుక్ర, శనివారాల్లో ఇరిగేషన్ డీఈ వచ్చి గండిని పరిశీలించారని, రెండు గంటలు కాల్వ ప్రవాహాన్ని తగ్గించమని కోరినా సహకరించలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ కట్టపై ఇళ్లు కూడా ఉన్నాయని, గండి కారణంగా ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని, వెంటనే కాల్వ ప్రవాహాన్ని తగ్గించాలని కోరుతున్నారు.



బందరు కాల్వకట్టకు గండి పడి ఏనుగులకోడు డ్రెయిన్‌లోకి వెళ్తున్న నీరు

# గుడివాడలో గలీజు

ఒక కాంప్లెక్సులోని ఒక షాపు అద్దె భారీగా ఉండి, ఆ పక్కనే ఉన్న మరో షాపు అద్దె ఎక్కడైనా చాలా తక్కువగా ఉంటుందా..? అప్పటి వరకు ఓ మహిళ పేరిట ఉన్న షాపు ఉన్నట్టుండి ఓ వైసీపీ నాయకుడి పేరున మారిపోతుందా..? ఇంకా గడువు ఉన్న దుకాణాలను లీజు పునరుద్ధరణకు పెట్టి, ఏడాదిగా అద్దె చెల్లించని 60 దుకాణాలను ఎవరైనా కొనసాగిస్తారా? ఇలాంటి చిత్ర విచిత్రాలెన్నో గుడివాడ పురపాలక సంఘంలో జరుగుతాయి. లక్షలాది రూపాయలను తమ జేబుల్లో వేసుకున్న మున్సిపల్ రెవెన్యూ అధికారులు బహిరంగ వేలం నిర్వహించకుండా లీజు పునరుద్ధరణ చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండిపెట్టడం వివాదాస్పదంగా మారింది.

## గుడివాడ పురపాలక సంఘంలో రెవెన్యూ చేతివాటం

- మున్సిపల్ దుకాణాల అద్దెల పునరుద్ధరణలో గోల్‌మాల్
- ఇష్టానుసారంగా అద్దెల పెంపు, పేర్ల ట్యాంపరింగ్
- రూ.లక్షల్లో అందిన ముడుపులు
- ప్రభుత్వం మారినా సాగుతున్న వైసీపీ హవా

వారు చెప్పిందే వేదంగా సాగిన లీజు పునరుద్ధరణ



గుడివాడ పురపాలక సంఘం

**గుడివాడ :** గుడివాడ రెవెన్యూ అధికారులు నిబంధనలు పాటించరు. సొంతంగా వారికి వారే నిబంధనలు పెట్టుకుని అందుకు అనుగుణంగా నడుచుకుంటారు. వైసీపీ హయాం నుంచి భారీగా దుకాణాల లీజు పునరుద్ధరణకు తెరలేపారు. ఇప్పటికే 100కుపైగా దుకాణాల లీజును నిబంధనలకు వ్యతిరేకంగా పునరుద్ధరించారు. ఇందుకోసం ఒక్కో దుకాణ లీజుదారుడి నుంచి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేశారు. ఈ మొత్తాన్ని వైసీపీ ముఖ్య నాయకుడి దగ్గర నుంచి కిందిస్థాయి రెవెన్యూ ఉద్యోగి వరకు పంచుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అనుచరుడు శశి చెప్పిన మాటే వేదంగా ఈ లీజుల పునరుద్ధరణ జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. వేలంపాట నిర్వహించకుండా దొడ్డిదారిన వైసీపీ నాయకులకు కట్టబెట్టేసి మున్సిపల్ ఆదాయానికి భారీగా గండికొట్టారు.

### నిదర్శనాలివే..

33 మున్సిపల్ దుకాణాల లీజు పునరుద్ధరణకు ఇటీవల రెవెన్యూ అధికారులు కౌన్సిల్‌కు సిఫారసు చేశారు. వివరాలతో కూడిన ఫైల్‌ను సిద్ధం చేశారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఆ ఫైల్‌ను చూస్తే రెవెన్యూ అధికారుల లీలలు బయటపడతాయి. ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు కనిపించవు. ఇష్టానుసారంగా అద్దెలు పెంచాలని పేర్కొంటూ కౌన్సిల్ ఆమోదానికి వెళ్లడం చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఒకే దుకాణ సముదాయంలో ఉన్న పక్కపక్క దుకాణాలకు వేర్వేరు అద్దెలు ప్రతిపాదించడం గమనార్హమే.

- ఎస్పీఎస్ నార్త్ మొదటి అంతస్తులోని 4ఏ, 5ఏ, 12ఏ దుకాణాల లీజు గడువు 2022, జూన్ 30తో ముగిసింది. రెండేళ్ల అనంతరం లీజు పునరుద్ధరణకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు సిఫారసు చేశారు. ముడుపులు ముట్టజెప్పిన నాటి నుంచి ఈ పునరుద్ధరణ అంశాన్ని తెరపైకి తెచ్చారు. అద్దె పెంపు కూడా ఒక్కొక్కరికీ ఒక్కోలా సిఫారసు చేశారు.
- ఎస్పీఎస్ నార్త్ మొదటి అంతస్తులోని 12ఏ, 15ఏ దుకాణాల అద్దె పెంపు సందిగ్ధంగా మారింది. లీజు పునరుద్ధరణ విషయంలో ఇష్టానుసారంగా లీజులను ఫిక్స్ చేసినట్టు సమాచారం. నిబంధనల ప్రకారం ఉండాల్సిన అద్దె కంటే తక్కువకే కట్టబెట్టారని సమాచారం.
- ఎస్పీఎస్ పడమర రెండో బ్లాకులోని 6, 9 నెంబర్ల దుకాణాలకు ఇంకా మూడు నెలలు గడువు ఉన్నా లీజు పునరుద్ధరణకు పెట్టారు. ఏళ్ల తరబడి పునరుద్ధరణకు నోచుకోని దుకాణాలను అలాగే వదిలేసి గడువు ఉన్న వాటిని ఇలా లీజు పునరుద్ధరణకు పెట్టడం వెనుక కథ ఏమిటో రెవెన్యూ అధికారులకే తెలియాలి.
- ఎన్టీఆర్ కాంప్లెక్సులోని 4వ నెంబరు దుకాణం లీజు గడువు 2021, మేతో ముగిసింది. దీని లీజు కూడా పునరుద్ధరించాలని ఫైల్ పెట్టారు. నాటి నుంచి నేటి వరకు లీజును పునరుద్ధరించకుండా.. ఆ పెరిగే అద్దెను ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులు తమ జేబుల్లో వేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- కఠారి సుబ్బయ్య మార్కెట్ (కేఎస్ఎం) కాంప్లెక్సులోని స్టాల్ నెంబర్ 2 గతంలో ఒక మహిళ పేరు మీద ఉండేది. వైసీపీ ముఖ్య నాయకుడు శశి సిఫారసుతో ఆ పార్టీ మాజీ కౌన్సిలర్ జోగా సూర్యప్రకాశరావు కుటుంబసభ్యుడి పేరున ట్యాంపరింగ్ చేసి తప్పుదోవ పట్టించారు. లీజు పునరుద్ధరణకు సిద్ధమయ్యారు.
- ఇదే కాంప్లెక్సులోని నెంబర్ 4 దుకాణానికి రూ.9,845 అద్దె పెంపునకు అధికారులు సిఫారసు చేశారు. ఇదే కాంప్లెక్సులో పక్కనే నెంబర్ 2 దుకాణానికి కేవలం రూ.4,000 నిర్ణయించడం వివాదాస్పదంగా మారింది. ఈ మొత్తం వ్యవహారాల్లో రహస్యాలను దాచి మున్సిపల్ ప్రత్యేక అధికారిని తప్పుదోవ పట్టిస్తున్నారు.

### టీడీపీ నాయకుల అసహనం

గతంలో ఆశీల వసూలు విషయంలో రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకుడిగా అనుకూలంగా వ్యవహరించి మున్సిపాలిటీకి భారీ మొత్తంలో గండి కొట్టారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఆశీల వసూలు విషయంలో వేలంపాటలో పాడుకున్న మొత్తాన్ని వైసీపీ సానుభూతిపరుడు చెల్లించకున్నా రెవెన్యూ అధికారులు నోరు మెదపలేదని టీడీపీ ముఖ్య నాయకుడు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం దుకాణాల లీజు పునరుద్ధరణ కూడా వైసీపీ నాయకుల సిఫారసు మేరకు ఇష్టానుసారంగా పేర్లు ట్యాంపరింగ్ చేశారని, అద్దెలను కూడా సకాలంలో వసూలు చేయలేదని పేర్కొంటున్నారు. మున్సిపల్ డిపార్టుమెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే కోట్లాది రూపాయల స్కామ్ బయటపడుతుందని అంటున్నారు.

# ఎరువు.. అదనపు బరువు..

ఎరువుల కంపెనీలు, ఏజెంట్ల లాభాపేక్ష రైతుల పాలిట శాపంగా మారింది. రైతులకు అవసరం లేకున్నా, అడగకున్నా కాంప్లెక్స్ ఎరువులతో పాటు 12 శాతం జింక్ ఈడీటీఏను కొనాలని ఆంక్షలు పెట్టి మరీ అంటగడుతున్నారు.

## జిల్లాలో ఎరువుల కంపెనీల ఏజెన్సీల దందా

- డీఏపీ, 20-20-0-13 కావాలంటే జింక్ ఈడీటీఏను కొనాల్సిందే..
- రైతులపై ఒత్తిడి పెడుతున్న కంపెనీలు
- వద్దన్న వారికి.. ఎరువుల స్టాక్ లేదంటూ అబద్ధాలు
- నామమాత్రపు విచారణ చేస్తున్న వ్యవసాయ అధికారులు

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ పనులు వేగవంతమయ్యాయి. బోరునీటి ఆధారంగా ఇప్పటికే వరినాట్లు వేసిన పొలాల్లోని వరిపైరు 30 రోజుల నుంచి 40 రోజుల వయసుకు చేరుకుంది. మొదటి కోటా పూర్తికాగా, రెండో కోటా ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులు ఎరువులు అధికంగా వినియోగించే సమయాన్ని అదునుగా తీసుకుని ఎరువులను విక్రయించే కంపెనీల ప్రతినిధులు హోల్‌సేల్ డీలర్లకు, వ్యాపారులకు ఏవేవో కారణాలు చూపి ఎరువులతో పాటు 12 శాతం జింక్ ఈడీటీఏను విక్రయిస్తున్నారు. వరినాట్లు వేసే సమయంలో లేదా మొదటి కోటాగా రైతులు డీఏపీ, 20-20-0-13 ఎరువులను యూరియాతో కలిపి అధికంగా పొలంలో చల్లుతారు. రైతులు డీఏపీ, 20-20-0-13 ఎరువులు కావాలని దుకాణాలకు వెళ్తే, ఒక బ్యాగుకు అరకిలో చొప్పున జింక్ కొంటేనే ఎరువులను విక్రయిస్తామని చెబుతున్నారు. జింక్ అవసరం లేదని, తక్కువ ధరకు వచ్చే జింక్‌ను తాము వాడతామని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు ఈ రెండు రకాల ఎరువుల స్టాక్ లేదని, రెండు రోజుల తరువాత రమ్మని చెప్పి వెనక్కి పంపేస్తున్నారు.

### రైతులపై అదనపు భారం

జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతుంది. ఇప్పటికే 98 వేల హెక్టార్లలో నాట్లు వేశారు. ఈ ఖరీఫ్ పూర్తయ్యే నాటికి అన్ని పంటలకు కలిపి జిల్లాలో 88,601 టన్నుల ఎరువులను వినియోగిస్తారని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. ఇందులో యూరియా 38,333 టన్నులు, డీఏపీ 10,529 టన్నులు, ఎస్ఎస్‌పీ 7,361 టన్నులు, మ్యూరేట్ - మిగతా 6లో

సోమేశ్వరుడి ఆలయంలో

# అధికారుల తనిఖీలు

- రూ.4 కోట్ల స్వాహాపై విచారణ
- రికార్డుల తనిఖీ అనంతరం నివేదిక 6లో..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'గూడుపురాణి'పై

# కదిలిన యంత్రాంగం

- ఇళ్లను పరిశీలించిన గృహ నిర్మాణ శాఖ అధికారులు
- లే అవుట్లలో తూతూమంత్రపు విచారణతో సరి 6లో..

## దుర్గమ్మ సేవలో కేశినేని చిన్ని దంపతులు


కేశినేని చిన్ని దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

**వన్‌టౌన్, ఆగస్టు 3:** విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తన పుట్టినరోజు సందర్భంగా శనివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను తన సతీమణి జానకీలక్ష్మి, తల్లి ప్రసూనాంబతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మ వారిని దర్శించుకుని చిన్ని దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటాలను వారికి ఆలయ ఈవో రామారావు అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. అంతకు ముందు చిన్ని దంపతులు కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు.

## సుబ్బారాయుడికి జస్టిస్ బి.శ్రీనివాస్ పూజలు


స్వామి చిత్రపటాన్ని హైకోర్టు న్యాయమూర్తి బి.శ్రీనివాస్‌కు అందిస్తున్న ఈవో చక్రధరరావు

**మోపిదేవి, ఆగస్టు 3:** సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాలను న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో ఎన్.ఎస్. చక్రధర్ అందజేశారు.

## రైతు బాంధవుడు కాకాని వెంకటరత్నం


పాల ఫ్యాక్టరీలో కాకాని వెంకటరత్నం విగ్రహానికి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

**చిట్టినగర్, ఆగస్టు 3:** "సామాన్య రైతుబిడ్డగా జీవితం ప్రారంభించి ఉన్నతస్థాయి పదవులు చేసి తుదిశ్వాస వరకు రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రైతు బాంధవుడు కాకాని వెంకటరత్నం. పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ స్థాపనలో ఆయన చూపిన చొరవను మరువలేం." అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకాని వెంకటరత్నం 124వ జయంతి కార్యక్రమాన్ని శనివారం పాల ఫ్యాక్టరీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కాకాని విగ్రహానికి చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## గూడుపురాణిపై కదిలిన యంత్రాంగం

▸ లే అవుట్లలో తూతూ మంత్రపు విచారణతో సరి



మోపిదేవి లేవుట్-1లో ఒక్క ఇంటిని మాత్రమే పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్న గృహనిర్మాణ శాఖ అధికారులు

**మోపిదేవి, ఆగస్టు 3:** జగనన్న లే అవుట్ల పేరుతో వైసీపీ నాయకులు చేసిన దోపిడీలపై గూడుపురాణి అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై గృహనిర్మాణశాఖ అధికారులు స్పందించారు. గృహనిర్మాణశాఖ ఈఈ వెంకట్రావు, డీఈ భానూజీరావులు మోపిదేవిలోని జగనన్న లే అవుట్లను శనివారం సందర్శించారు. మోపిదేవి పంచాయతీ పరిధిలోని లే అవుట్-1, 2, 3, 4లలో పర్యటించారు. కేవలం ప్లాట్లు, గృహాల పరిశీలనకే పరిమితమయ్యారు. లే అవుట్-1లో బినామీ పేర్లతో ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించినా అనేక ప్లాట్లు బినామీ పేర్లతో విక్రయాలు జరిగినప్పటికీ ప్రస్తుతం ప్లాట్లలో ఎవరు ఉంటున్నారు. పట్టా ఎవరి పేరుపైన మంజూరైందనే వివరాలు కూడా పూర్తిస్థాయిలో నమోదు చేసుకోలేదు. ఒక్క ఇంటి వద్ద మాత్రమే విచారణ జరిపి తూతూ మంత్రపు విచారణతో సరిపెట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులుగా పని చేస్తూ వేరే జిల్లాకు చెందిన వ్యక్తులు లే అవుట్ 4లో పక్కా గృహం నిర్మిస్తున్నారని పరిసర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు చెప్పినప్పటికీ విచారణ అధికారులు పట్టించుకోకపోవటం పలు ఆరోపణలకు తావిస్తోంది. ఎంతోకాలంగా వివాదాస్పదంగా ఉన్న మోపిదేవి నుంచి రావివారిపాలెం వెళ్లే లేవుట్-3ను సందర్శించి ఎస్సీ సామాజికవర్గాలకు కేటాయించి నిర్మించిన గృహాలు, ఇరువైపులా ఇతర సామాజికవర్గాల వారు రహదారిని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను ఈఈ పరిశీలించారు. రహదారి, మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ఎస్సీలు వారి ఆవేదనను ఈఈకి తెలియజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని, నివేదికను వారికి అందజేస్తామని గృహనిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. హౌసింగ్ ఏఈ తాండవ కృష్ణ, సహాయకులు వారి వెంట ఉన్నారు.

## ఉద్యానపంటల రాయితీలు విడుదల

**మచిలీపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):** కృష్ణాజిల్లాలో ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు రాయితీలను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్‌పామ్ తోటలు సాగుచేసిన రైతులకు రాయితీగా రూ.1.13 కోట్లను విడుదల చేశామన్నారు. ఈ నగదును రైతుల ఖాతాల్లో త్వరలో జమచేస్తామని తెలిపారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు ఉద్యాన పంటలకు రాష్ట్రీయకృషి వికాసయోజన పథకం ద్వారా రూ.20 లక్షల రాయితీని ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. 2024-25లో ఉద్యాన పంటలు సాగుచేసిన రైతులకు రాయితీలను ప్రకటిస్తూ విధివిధానాలను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1800 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్లు, మైక్రోఇరిగేషన్ కోసం రూ.12.96కోట్లను జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం అనుమతులిచ్చిందని తెలిపారు. ఉద్యానపంటలు సాగుచేసే రైతులు రాయితీలకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఎన్టీఆర్ జిల్లాలో రూ.3.23 కోట్లు జమ

**కృష్ణలంక:** ఎన్టీఆర్ జిల్లాలో 2,387 మంది రైతులకు వివిధ ఉద్యాన పథకాల(2023-24) కింద మొదటి విడతగా రూ.3.23 కోట్ల ప్రభుత్వ రాయితీ విడుదలైందని, కలెక్టర్ ఆమోదంతో రైతుల ఖాతాల్లో ఈ రాయితీ మొత్తాన్ని నేరుగా జమ చేస్తామని జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద 267 మంది రైతులకు రూ.0.965కోట్లు, జాతీయ వంట నూనెల మిషన్-ఆయిల్‌పాం కింద 661 మంది రైతులకు రూ.1.614 కోట్లు, ఉద్యాన పంటల సమగ్రాభివృద్ధి పథకం కింద 1,459 మంది రైతులకు 0.649 కోట్లు రాయితీ విడుదలైనట్లు తెలిపారు. 2023-24కు సంబంధించి రెండో విడత నిధులు, 2022-23, 2021-22, 2020-21 సంవత్సరాలకు రాయితీ నిధులు కూడా త్వరలో విడుదలవుతాయని రాష్ట్ర ఉద్యాన సంచాలకులు తెలియజేశారని ఆయన వెల్లడించారు. 2024-25కు ఉద్యాన పథకాల్లో రాయితీ పొందేందుకు రైతులు తమ గ్రామంలోని రైతుసేవా కేంద్రాల్లోని గ్రామవ్యవసాయ/ఉద్యాన సహాయకులను సంప్రదించాలని సూచించారు.

# వైసీపీ పాలనలో కుదేలైన రాష్ట్రం

▸ ఆర్థిక వ్యవస్థ మెరుగుకు, రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి: మంత్రి సత్యకుమార్


కూచిపూడి సిలికానాంధ్ర సంజీవని వైద్యశాలలో ధన్వంతరి వార్డును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్

**కూచిపూడి, ఆగస్టు 3:** "గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు ఆర్థికంగా కుదేలయ్యాయి. వాటిని సరిచేసి ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసేందుకు చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది." అని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ అన్నారు. కూచిపూడి సిలికానాంధ్ర సంజీవని వైద్యశాలలో ధన్వంతరి వార్డును శనివారం ఆయన ప్రారంభించారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, విధ్వంస కాండలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్వేతపత్రాలపై వివరిస్తున్నారన్నారు. తలసరి ఆదాయం పెరగాల్సింది పోయి తలసరి అప్పులు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వానికి అద్భుత విజయాన్ని అందించి ప్రజలు రాష్ట్రాన్ని కాపాడుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సిలికానాంధ్ర వైద్యశాల అభివృద్ధికి చంద్రబాబు రూ.10 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, ఆ నిధులు విడుదలకు కృషి చేయాలని నిర్వాహకులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు సత్యకుమార్‌ను కోరారు. సీఎంతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అంతకు ముందు బీజేపీ నాయకుడు పోలన అశోక్‌కుమార్ నాయకత్వంలో మంత్రిని కూచిపూడి సెంటర్‌లో భారీ గజమాలతో సత్కరించారు. వైద్యశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో సహకరిస్తామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హామీ ఇచ్చారు. వైద్యశాల అభివృద్ధిపై మంత్రికి కొన్ని విజ్ఞాపనలు అందజేశారు. సంజీవని వైద్యశాలలో అందిస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయ మని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా తమ వైద్యశాలలో వైద్య సేవలు అందిస్తున్నామని సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. ఆర్ టీవీ అధినేత రవిప్రకాష్, సర్పంచ్ కొండవీటి విజ యలక్ష్మి, వైద్యశాల ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, డీఎంహెచ్‌వో జెగీతాభాయి పాల్గొన్నారు. సత్యకుమార్, బుద్ధప్రసాద్, కుమార్‌రాజాను నిర్వాహకులు సత్కరించారు.

## నెరవేరిన సొంతింటి కల

▸ ఇద్దరు గిరిజన లబ్ధిదారుల వాటా చెల్లించిన ప్రభుత్వం


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ జి.సృజన

**కృష్ణలంక, ఆగస్టు 3:** ఇళ్ల కేటాయింపులో చెల్లించాల్సిన గిరిజనుల వాటాను ప్రభుత్వమే చెల్లించి వారి సొంతింటి కలను నెరవేర్చిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. జేఎస్ఎస్‌యూఆర్ఎం పథకం కింద ఇంటిని కేటాయించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా లబ్ధిదారుల వాటాగా ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయ చెక్కులను శనివారం గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె.సునీతతో కలిసి కలెక్టరేట్‌లోని చాంబర్‌లో అందించారు. అజిత్‌సింగ్‌నగర్ సమీపంలో ఉంటున్న ఎస్టీలు ట్రాన్స్‌జెండర్ పాలపర్తి గౌరి, విభిన్నప్రతిభావంతురాలు మిండ్యాల మరియమ్మకు ప్రభుత్వం జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద రాజరాజేశ్వరీపేటలో ఇళ్లు మంజూరు చేసిందన్నారు. గృహాలను పొందేందుకు లబ్ధిదారుల వాటా కింద చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించలేమని, ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం చేయాలని వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఒక్కొక్కరికి రూ.66 వేలను మంజూరు చేసి ఆర్థిక సహాయాన్ని నేరుగా నగర పాలక సంస్థకు చెల్లించి సొంత ఇంటి కలను నెరవేర్చినట్లు కలెక్టర్ తెలిపారు.

### కాంట్రాక్టు ఉపాధ్యాయులకు నియామకపత్రాలు

ఎ.కొండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల సర్వీసును ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ జి.సృజన తెలిపారు. హిందీ స్కూల్ అసిస్టెంట్ ఎం.శరత్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ జి.బాబూరావు, తెలుగు ఎస్ఏ జి.అమలమ్మ, ఇంగ్లీష్ ఎస్ఏ ఎం.శిరీష, బయోలాజికల్ సైన్స్ ఎస్ఏ ఎం.చంద్రబాబు, ఫిజికల్ సైన్స్ ఎస్ఏ ఎస్‌కే సైదా, సోషల్ స్టడీస్ అసిస్టెంట్ పి.పద్మజ, ఎస్జీటీ కె.రాజబాబుకు సర్వీసు పొడిగిస్తూ నియామకపత్రాలను కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో అందించారు.


అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

## భూసేకరణ సమస్యలు పరిష్కరించండి

▸ అధికారులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

**మచిలీపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):** కృష్ణాజిల్లాలో భూసేకరణకు సంబంధించిన పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో జేసీ గీతాంజలి శర్మతో కలిసి జిల్లాలోని రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులతో ఆయన శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులకోసం సేకరించిన భూములు, 22-ఏనుంచి భూముల తొలగింపు, గన్నవరం విమానాశ్రయం, బందరుపోర్టు, భారత్‌సాల్ట్, మల్లవల్లి పారిశ్రామికవాడల్లో భూసేకరణ సమస్యలపై ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూములసేకరణ, భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లింపును సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివాదాస్పద భూముల అంశాల్లో అధికారులు చట్ట ప్రకారం నడచుకోవాలన్నారు. సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపులో వాస్తవ హక్కుదారులను గుర్తించాలన్నారు. మచిలీపట్నం పోర్టుకు 45ఎకరాల అసైన్డ్‌భూమికి ఎల్పీ షెడ్యూలు వివరాలతో కూడిన పత్రాలను సేకరించాలని, న్యాయపరమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇళ్ల స్థలాల పంపిణీ కోసం ఎన్ని లే అవుట్లు వేశారు. ఎంతమేర పరిహారంగా చెల్లించారు. ఇంకా పరిహారం చెల్లించకుండా పెండింగ్ ఉండటానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, బందరు, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం.వాణి, పి.పద్మావతి, డి.రాజు, సర్వే విభాగం ఏడీ మనీషా త్రిపాఠి, రిజిస్ట్రార్ వీవీవీ దుర్గాప్రసాద్, మచిలీపట్నంపోర్టు, గన్నవరం ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

### పేదల పక్కా ఇంటి కల నెరవేరుస్తాం

▸ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర


మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3:** పేదల పక్కా ఇంటి కల సాకారం చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టంచేశారు. తన కార్యాలయంలో శనివారం మునిసిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు అంతా డ్రామా అని పేదలకు న్యాయం జరగలేదని అన్నారు. సెంటు పట్టాల పేరుతో భారీ స్కామ్‌లకు వైసీపీ నాయకులు తెరలేపారని ఆరోపించారు. అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు ఇచ్చి అవే గొప్ప అన్నట్టుగా వ్యవహరించారన్నారు. గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారు లకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామని, త్వరలోనేమార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపారు. స్థలం ఎక్కడ అందుబాటులో ఉందో చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇళ్ల పట్టాల కేటాయింపులో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కొల్లు రవీంద్ర సూచించారు.

### డాక్టర్ సతీష్‌రెడ్డికి మండలి కృష్ణారావు పురస్కారం

**అవనిగడ్డ, ఆగస్టు 3:** తెలుగు తేజం, దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి వేడుకలను గాంధీక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో భారత రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డికి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కూచిభొట్ల ఆనంద్, జమీన్ రైతు సంపాదకుడు డోలేంద్ర ప్రసాద్ విచ్చేస్తారని పేర్కొన్నారు.

### గంజాయి విక్రేతకు మూడేళ్ల జైలు

**మచిలీపట్నం, ఆగస్టు 3( ఆంధ్రజ్యోతి):** గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి చిన్నంశెట్టి రాజు శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం బొంగారపుపేటకు చెందిన మీసాల శ్రీనివాసరావు గుడివాడ మండలం రామనపూడివద్ద గంజాయి విక్రయిస్తుండగా 2020 ఆగస్టు 1వ తేదీన గుడివాడ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతనిపై నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది.

# గుడివాడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

▸ నిధుల మంజూరుకు కృషి: ఎంపీ బాలశౌరి


ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల

**గుడివాడ:** గుడివాడ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, అత్యధిక నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఆయన మాట్లాడారు. టిడ్కో కాలనీలో తాగునీటి సమస్యపై టిడ్కో, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. టిడ్కో కాలనీలో రూ.కోటి కేంద్ర నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తానన్నారు. పట్టణంలో బైపాస్ రోడ్డుకు కూడా నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానన్నారు. టిడ్కో కాలనీలో రెండో వాటర్ ట్యాంకును నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి పూర్తిస్థాయిలో అంచనాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని, కొన్ని ప్రాంతాల్లో అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలో రూ.2కోట్లతో సోలార్ ప్లాంట్, సిటి స్కాన్‌ల ఏర్పాటుకు నిధులు విడుదల చేశామన్నారు. గంజాయిని అరికట్టాలని పోలీసులను ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.

### రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

పామర్రురోడ్డులో నిర్మాణంలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఎంపీ బాలశౌరి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని నేషనల్ హైవే అథారిటీ డీఈ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. మార్చి నెలాఖరుకు పనులు పూర్తి చేయాలన్నారు.

### ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్లకు సత్కారం

ప్రజావేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ బాలశౌరి పాల్గొన్నారు. ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రామును సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బాబూరాజేంద్రప్రసాద్, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కాకరాల సురేష్, ఇతర సర్పంచ్‌లు సత్కరించి నోటు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ, బూరగడ్డ శ్రీకాంత్, గుత్తికొండ శ్రీరాజబాబు, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, మున్సిపల్, రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

## బిందు సేద్యానికి రాయితీలు

**కృష్ణలంక, ఆగస్టు 3:** 2024-25 సంవత్సరానికి ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్, సింక్లర్లకు ఆరు వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించారని, ఇందుకు రూ.19.82 కోట్ల రాయితీ కేటాయించామని ఏపీఎంఐపీ పథక సంచాలకుడు పీఎం సుభాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్ట, మాగాణి ఏదైనా 5 ఎకరాలలోపు 90 శాతం రాయితీ(రూ.2.18 లక్షల వరకు), 5 నుంచి 12.50 ఎకరాలలోపు 50 శాతం రాయితీ(రూ.3.10 లక్షల వరకు) ఇస్తామని పేర్కొన్నారు. డ్రిప్, స్ప్రింకర్ల పరిక రాలు పొందే రైతులు ఆధార్ కార్డ్, 1బీ పత్రం, ఎఫ్ఎంబీ, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకుని సమీప రైతుసేవా కేంద్రం/ ఉద్యాన అధికారి/పథక సంచాలకుడు కార్యాలయంలో సంప్రదించి నచ్చిన కంపెనీని ఎన్నుకుని బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0866-3500193, 79950 09910, 79950 09911 నెంబర్లకు ఫోన్‌చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

## టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరొకరికి రిమాండ్

**గన్నవరం, ఆగస్టు 3:** గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరొకరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఏ 23 అయిన రౌడీషీటర్ పఠాన్ యూసఫ్‌ఖాన్‌ను శనివారం గన్నవరం స్థానిక కోర్టులో హాజరు పరచారు. కోర్టు అతనికి 14రోజులు రిమాండ్ విధించింది. ఆయనను గన్నవరం సబ్ జైల్‌కు తరలించారు. అదే కేసులో ఉన్న మెండెం రాంబాబును, షేక్ ఇమ్రాన్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## ఎరువు.. అదనపు బరువు

(ఐదో పేజీ తరువాయి)

ఆఫ్ పొటాష్ 3,821 టన్నుల ఎరువులను రైతులు పొలాలకు వాడతారు. వీటితో పాటు 20-20-0-13, 28-28, 1435, 10-26-26 తదితర రకాల కాంప్లెక్స్ ఎరువులను 28,457 టన్నులను సమయానుకూలంగా రైతులు కొని పొలంలో చల్లుతారు. ఆఖరు కోటాగా పొటాష్ ఎరువును వరిపైరు పొట్టదశలో చల్లుతారు. 20-20-0-13 ఎరువు ఒక బ్యాగు రూ.1,250, డీఏపీ ఒక బ్యాగు ధర రూ.1,350గా ఉంది. ఈ రెండు రకాల ఎరువులతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను కొనేందుకు రైతులు వెళ్తే, ఒక్కో బ్యాగుకు అరకిలో జింక్ ప్యాకెట్‌ను కొనాల్సిందేనని ఎరువుల దుకాణ యజమానులు, పీఏసీఎస్‌లలో పనిచేసే సిబ్బంది షరతులు పెడుతున్నారు. అరకిలో జింక్ ప్యాకెట్ ధరను కంపెనీల రకాలను బట్టి రూ.400 నుంచి, ఆపైన ధరగా నిర్ణయించి బలవంతంగా రైతులకు విక్రయిస్తున్నారు. దీంతో ఐదు ఎకరాల భూమిని సాగుచేసే రైతు రూ.2వేలతో జింక్ ప్యాకెట్లను కొనాల్సి వస్తోంది.

### అసలు కథ ఇదీ..

జిల్లాకు కాంప్లెక్స్ ఎరువులను క్రిబ్‌కో, గ్రోమోర్, ఇఫ్కో, ఆర్‌సీఎఫ్, చంబల్ ఫెర్టిలైజర్స్ పీపీఎల్, జై కిసాన్ తదితర కంపెనీలు సరఫరా చేస్తాయి. కంపెనీ ప్రతినిధులు డీఏపీ, 20-20-0-13ను విక్రయించే సమయంలో 12 శాతం జింక్ ఈడీటీఏను తప్పనిసరిగా కొనాలని నిబంధన పెడుతున్నారు. ఒక లారీలో 500 బ్యాగుల డీఏపీ, 20-20-0-13 ఎరువులు హోల్‌సేల్ డీలర్ల నుంచి రిటైల్ వ్యాపారులకు ఒక్కో బ్యాగుకు ఒక ప్యాకెట్ చొప్పున 12 శాతం జింక్ ఈడీటీఏను లింక్ చేసి విక్రయిస్తున్నారు. దీంతో రిటైల్ వ్యాపారులు, పీఏసీఎస్‌ల్లో డీఏపీ, 20-20-0-13తో పాటు జింక్ ప్యాకెట్లను రైతులు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇదేమని రైతులు ప్రశ్నిస్తుండటంతో 20 రోజులుగా డీఏపీ ఎరువు కొరతను సృష్టించారు. డీఏపీ ఎరువును గ్రోమోర్ కంపెనీ ప్రతినిధులు ప్రతి మండలంలో ఉన్న తమ సొంత అవుట్‌లెట్లలో ఉంచి జింక్ ప్యాకెట్లతో కలిపి విక్రయించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో వ్యాపారుల ద్వారా కూడా విక్రయిస్తున్నారు. 12 శాతం జింక్ ఈడీటీఏను బలవంతంగా కొనుగోలు చేయించడంపై ఇటీవల రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గుడివాడ, మచిలీ పట్నం, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా అధికారులు తనిఖీలు చేశారు. ఏం చర్యలు తీసుకున్నారో ఇప్పటివరకు తెలియదు.

## సోమేశ్వరస్వామి ఆలయంలో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేడీ కె.సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ శోభారాణి


**ఉయ్యూరు, ఆగస్టు 3:** సోమేశ్వర స్వామి ఆలయంలో శనివారం దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేసీ కె.సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ శోభారాణి ఆధ్వర్యంలో రికార్డులు తనిఖీ చేశారు. సోమేశ్వరుడి సొమ్ము స్వాహా, ఆలయంలో రూ.4 కోట్లు హాంఫట్ శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. దేవస్థానానికి చెందిన 26 ఎకరాల పొలంలో ఆరు ఎకరాలు విజయవాడ- మచిలీపట్నం హైవే నిర్మాణంలో పోగా దేవస్థానానికి రూ.8.36 కోట్లు ఆదాయం వచ్చింది. ఆ మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దానికి సంబంధించి ఐదేళ్లుగా వడ్డీ రూపంలో వచ్చిన మొత్తం, ఆలయానికి వచ్చే ఆదాయం ఆలయ ఈవో పక్కదారి పట్టించినట్టు వచ్చిన కథనంపై అధికారులు విచారణ చేపట్టారు.

### కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తాం

బ్యాంకు నుంచి సొమ్ము డ్రాచేసి పక్కదారి పట్టించారని వచ్చిన కథనం మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో విచారణ చేపట్టామని, రికార్డులు తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తామని ఆర్‌జేసీ కె.సుబ్బారావు తెలిపారు.

## దేవదాయశాఖలో అవినీతిపై విచారణ జరిపిస్తాం

▸ భక్తులకు డిప్యూటీ కమిషనర్ విజయకుమార్ హామీ


అన్యాక్రాంతమవుతున్న ఆలయాల ఆస్తుల వివరాలను డీసీ విజయకుమార్‌కు వివరిస్తున్న భక్తుడు ఈవూరి సురేష్

**నందిగామ, ఆగస్టు 3:** దేవదాయశాఖలో అవినీతి జరుగుతోందని భక్తులు చేస్తున్న ఆరోపణలపై ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయకుమార్ స్పందించారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక సీతారామాంజనేస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నందిగామ ప్రాంతంలోని 26 ఆలయాలకు చెందిన రికార్డులను డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్‌ను రామలింగేశ్వరస్వామి ఆలయ ఆస్తుల అన్యాక్రాంతంపై న్యాయపోరాటం చేస్తున్న ఈవూరి సురేష్ అనే భక్తుడు కలిశారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 821-1లో ఉన్న అత్యంత విలువైన 5.38 ఎకరాలను సర్వే చేయాలని తాను దరఖాస్తు చేశానని, దరఖాస్తుదారుడైన తనకు సమాచారం ఇవ్వకుండా అక్రమార్కులతో చేతులు కలిపి తప్పుడు సర్వే చేశారని, అక్రమార్కులకు లబ్ధి జరిగేలా ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి హద్దులు తేల్చారని డీసీకి వివరించారు. స్పందించిన డీసీ తక్షణమే మరోమారు ఫిర్యాదుదారుడితో పాటు పది మంది సమక్షంలో సర్వే చేయాలని ఈవోను ఆదేశించారు. 1996లో రామలింగేశ్వనగర్‌లోని 17 ఎకరాల భూమిని ప్లాట్లుగా విభజించి వేలం నిర్వహించారని అందులో 32 పాట్లు అన్యాక్రాంతం అయినట్లు తాను పలుమార్లు ఫిర్యాదు చేశానని అయినా పట్టించుకోవడం లేదని సురేష్ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తామని డీసీ ఆయనకు హామీ ఇచ్చారు. ఆలయ భూములను 11 సంవత్సరాల లీజుల పేరుతో అన్యాక్రాంతం చేయడం మానుకోవాలని డీసీని సురేష్ కోరారు. పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఆలయానికి చెందిన షాపుల అద్దెల విషయంలోనూ భారీ అవినీతి జరుగుతోందని పలువురు భక్తులు ఆరోపించారు. దీనిపై స్థానిక అధికారులను డీసీ వివరణ కోరగా, తాము స్థలానికి మాత్రమే అద్దె వసూలు చేస్తున్నామని, షాపులు వ్యాపారులే నిర్మించుకున్నారని చెప్పారు. దీంతో అధికారులపై డీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ స్థలాల్లో శాశ్వత భవనాలను వారెలా నిర్మించుకుటారని ప్రశ్నించారు. తక్షణమే అద్దెలపై సమీక్ష జరిపి ఆలయానికి ఆదాయం పెరిగేలా చూడాలని ఆదేశించారు. ఖాళీ స్థలం అద్దెలు కాకుండా భవనాల లెక్కన అద్దెలు వసూలు చేయాలని ఆదేశించారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 105, 116 |
| చికెన్ విత్ స్కిన్ | 180 |
| చికెన్ స్కిన్‌లెస్ | 190 |



**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 3 :** విద్యుత్ వినియోగదారుల్లో రైతులు, ప్రజా వినియోదారులను విడగొట్టి నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించేందుకు చేపట్టిన ఆర్‌డీఎస్ఎస్(రివాంప్డ్ డిస్ట్రిబ్యూటరీ సిస్టం) వల్ల అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలో శనివారం విద్యుత్ ఆధునికీకరణ పనులకు సర్పంచ్ రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణలతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషితో వీరవల్లి, తేలప్రోలు, ఉంగుటూరు, హనుమాన్‌జంక్షన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు రూ. 67కోట్ల కేంద్రం నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాలిపర్తి సీతారామయ్య, మొవ్వా వెంకటేశ్వరచౌదరి, తాతారావు, రామాంజనేయులు, విద్యుత్‌శాఖ సిబ్బంది బాలాజీ, నాగరాజు, వి.ఎస్.ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన దేవినేని రాజా

**కంకిపాడు, ఆగస్టు 3 :** నియోజకవర్గ అభివృద్ధికి రూ. 23 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్టు కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అడిగిందే తడవుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించటం హర్షణీయమన్నారు. రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపించేందుకు బోడె ప్రసాద్ విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు.

## పెన్షన్‌లు పంపిణీ చేయని ఉద్యోగికి 14 రోజులు రిమాండ్

**గన్నవరం, ఆగస్టు 3 :** సచివాలయం-1లో పెన్షన్‌లు ఇవ్వకుండా ఆ సొమ్ముతో ఉడాయించిన ఉద్యోగికి 14 రోజులు రిమాండ్ విధించారు. స్థానిక సచివాలయం-1లో పెన్షన్‌లు పంపిణీ చేయమని అగ్రికల్చర్ అసిస్టెంట్ రోశయ్యకు పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ నగదు ఇవ్వగా వాటిల్లో రూ.52, 500లను 14 మందికి ఇవ్వక పోవటంతో క్రమశిక్షణ చర్యలో భాగంగా పోలీస్ కేసు పెట్టారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు అతన్ని గన్నవరం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు.

## నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దేవినేని రాజా కుటుంబ సభ్యులు

**ఈడుపుగల్లు (కంకిపాడు), ఆగస్టు 3 :** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావడం హర్షణీయమని ఈడుపుగల్లు ఎంపీపీ మోడల్ స్కూల్ హెచ్ఎం రూపవాణి అన్నారు. దేవినేని బాలగంగాధర్‌రావు జ్ఞాపకార్థం ఆయన మునిమనవళ్లు, మనవరాళ్లు దీక్షిత, సాయి, వరలక్ష్మి, రితిక, వైష్ణవి కృపల చేతుల మీదుగా విద్యార్థులకు రూ. 15 వేలు విలువైన నోటు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవినేని వెంకటరామ్ కిరణ్, లలిత, గుమ్మడి సాయి కుమార్, లక్ష్మీప్రసన్న, లక్ష్మీదుర్గ, పర్వతనేని అమరవీర్, హైమా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు మండవ శ్రీనివాసు, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి : సీఐ బాషా

**ఉయ్యూరు, ఆగస్టు 3 :** విద్యార్థి దశ నుంచి పిల్లలు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా అన్నారు. నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ జైసన్ అధ్యక్షతన క్యాబినేట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ, విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు అలవరుచుకుని భవిష్యత్తుకు మంచి నాయకులుగా ఎదగాలన్నారు. నూతనంగా ఎన్నుకున్న విద్యార్థి నాయకులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఏజీఎం అనిల్, ఆర్ఐ సుమంత్, వైస్ ప్రిన్సిపాల్ రత్నజ్యోతి, కో- ఆర్డినేటర్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన



**గన్నవరం, ఆగస్టు 3 :** అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచనలు చేశారు. మండలంలోని సూరంపల్లిలో గర్భిణులకు, బాలింతలకు వైద్య, ఐసీడీఎస్, విజయవాడ సెయింట్ ఆన్స్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వైరల్ ఫీవర్స్‌పై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. జ్వరం రాగానే వైద్యులకు చూపించాలని లేకుంటే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలుగా మారే అవకాశం ఉందన్నారు. సాధ్యమైనంత వరకూ కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ వర్కర్ ఇ.కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మైత్రీ సంఘాలు పునరుద్ధరించాలి

**హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 3 :** గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలను అరికట్టడానికి గతంలో తెలుగు దేశం ప్రభుత్వం ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన మైత్రీ సంఘాలను మళ్లీ పునరుద్ధరించాలని బీజేపీ బాపులపాడు మండల అధ్యక్షుడు జింకా నలగామరాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అక్రమ మద్యం సరఫరా, గంజాయి విక్రయాలు, వినియోగం నియంత్రణ కేవలం పోలీస్ శాఖ, నిఘా విభాగాలతోనే సాధ్యం కాదని మైత్రీ సంఘాలు కూడా దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్రాభివృద్ధే కూటమి లక్ష్యం

**ఎంపీ వల్లభనేని బాలశౌరి**




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

**గుణదల, ఆగస్టు 3:** రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఎంపీగా గెలుపొందాక మొదటి సారిగా గన్నవరం నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడు టీడీపీ కార్యాలయంలో శనివారం కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయిందన్నారు. సంపదను సృష్టించి రాష్ట్రాన్ని ఆర్థికంగా వృద్ధిలోకి తేగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలోనూ పలు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధతను వ్యక్తం చేయడంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విశేషమైన కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, చలమలశెట్టి రమేష్, బండ్రెడ్డి రామకృష్ణ, గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, కొల్లా ఆనంద్, సర్నాల బాలాజి, కోనేరు సందీప్, శివరామకృష్ణ(పెదబాబు) పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



రికార్డులు పరిశీలిస్తున్న వైద్య బృందం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 3 :** ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందుకు అవసరమైన తక్షణ చర్యలు తీసుకునేలా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే గ్రామంలో క్షేత్రస్థాయి తనిఖీలు, పరిశీలన చేపట్టినట్టు రాష్ట్ర రాపిడ్ రెస్పాన్సిబుల్ బృంద సభ్యుడు డాక్టర్ అచ్యుతరామరాజు తెలిపారు. బిళ్లనపల్లిలో ఇటీవల ఒకరు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్ఆర్‌టీం సభ్యులు శనివారం క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఫీవర్ సర్వే రిపోర్టులను పరిశీలించారు. ఆర్ఆర్‌టీం సభ్యులు డాక్టర్ అచ్యుతరామరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సుజనప్రియ, జనరల్ మెడిసన్ డాక్టర్ మహేష్‌లతో కూడిన బృందం గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మంజూష, జిల్లా మలేరియా అధికారి రామారావు, సబ్‌యూనిట్ అధికారి వెంకటరాజు, సీహెచ్ఓ ఫణి కుమార్, ఎం.వి. అప్పారావు, మాలతి, జి.నాగరాజు, శివాజీ తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### పారిశుధ్య పనులు చేపట్టాలి

**గుణదల :** పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని, పక్కా ప్రణాళికతో పనులు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి ఎన్.వి.శివప్రసాద్ అన్నారు. పారిశుధ్య పనుల ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా నిడమానూరులోని రామానగర్, నెహ్రూనగర్లలో శనివారం ఉదయం పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కాకాని సేవలు చిరస్మరణీయం

**విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు**



కాకాని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న చలసాని

**హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 3 :** రైతు పక్షపాతిగా పాడి రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసిన మహానేత కాకాని వెంకటరత్నం చిరస్మరణీయుడని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం కాకాని వెంకటరత్నం జయంతి సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కాకాని కల్యాణ మండపంలోని వెంకటరత్నం విగ్రహంతో పాటు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, కె.సీతారాంపురం, కోడూరుపాడు పాల ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులు కొల్లి రంగారావు, ఎనికేపల్లి శ్రీమన్నారాయణ, సీహెచ్ రంగారావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్, సూపర్‌వైజర్లు, పాల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుకు దిక్సూచి పొలంబడి



నారుశుద్ధి విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 3 :** నూతన సాంకేతికతను రైతులకు చేరువచేసేలా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు పొలం బడి కార్యక్రమం రైతులకు దిక్సూచిలా నిలుస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి తెలిపారు. ఎస్.ఎన్.పాలెంలో వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జె.భవాని, కంపసాటి కొండలరావు, మేకల సాంబశివరావు, శ్రీనివాసరావు, చెన్నుబోయిన గణేష్, ఈశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన



పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు



వణుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 3 :** పరిశుభ్రతపైనే ఆరోగ్య పరిస్థితి ఆధారపడి ఉంటుందని అందుకే చిన్ననాటి నుంచి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ అన్నారు. బొమ్ములూరులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం చిన్నారులకు నిర్వహించిన శారీరక శుభ్రతపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహార వినియోగం గురించి ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుళ్లపూడి విజయలక్ష్మి, కాట్రు దీనమ్మ, పచిగళ్ల మరియమ్మ, చిమట హేమనాగిని, తదితరులతో పాటు అంగన్‌వాడి, ఆశవర్కర్లు పాల్గొన్నారు. ● నవజాత శిశువులకు తల్లిపాలతో రోగనిరోధకశక్తి పెరుగుతుందని అందుకే తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ అన్నారు. మడిచర్లలో శనివారం నిర్వహించిన తల్లిపాలవారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రజని, అరుణాలత, భాగ్యమ్మ, సుజాత, స్వాతి తదితర అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **కంకిపాడు :** చిన్నారులు ఆరోగ్యకరంగా ఉండాలంటే బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని ఏఎన్ఎం వి. రష్మి అన్నారు. పెనమలూరు మండలంలోని వణుకూరు - 4 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి. సునీత, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకోవాలి

**పెనమలూరు, ఆగస్టు 3 :** కేరళలో వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఎం పెనమలూరు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు అన్నారు. ఇటీవల కేరళలో వరదల కారణంగా నష్ట పోయిన వారిని ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో తాడిగడప సెంటర్ నుంచి పోరంకి వరకు విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె బాబు, మరీదు భాస్కరరావు, పుసులూరి సత్య నారాయణ, సీహెచ్ భవాని, రమణమ్మ, వై. సరళ, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు. ● **హనుమాన్‌జంక్షన్ :** కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఎం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రజల నుంచి విరాళాలు సేకరించింది. జంక్షన్‌లోని నాలుగు రోడ్లలో సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ప్రజలు నుంచి రూ. 15,200లు విరాళాలు సేకరించినట్లు సీఐటీయూ బాపులపాడు మడల అధ్యక్షుడు బేత శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట సాంబశివరావు, కోరం రవి, కళ్లం వెంకటేశ్వరరావు, రాజనాల సురేష్, రాఘవయ్య, నాగరాజు, పెద్దిరాజు, రాములు పాల్గొన్నారు.






తాడిగడప సెంటర్‌లో విరాళాల సేకరణ.. జంక్షన్‌లో..



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్

## గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

**గన్నవరం మండల సమావేశంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు**

**గన్నవరం, ఆగస్టు 3 :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైస్ ఎంపీపీ-1 కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరిపారు. మండలంలో నెలకొన్న సమస్యలను పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని, గ్రామాల్లో సాగునీటి సమస్యలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వైస్ఎంపీపీ-2 కాలగడ్డ శివనాగరాజకుమారి, ఎంపీడీవో ఈ సత్యకుమార్, అధికారులు పాల్గొన్నారు.



యాకమూరు వద్ద పుల్లేరులో చెత్త డంపింగ్‌ను పరిశీలిస్తున్న ఏఈ మణికంఠ

## పుల్లేరులో వ్యర్థాల డంపింగ్‌పై పరిశీలన

**[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]**

**ఉయ్యూరు, ఆగస్టు 3 :** యాకమూరు వద్ద పుల్లేరు కాల్వను ఇరిగేషన్ సిబ్బంది శని వారం పరిశీలించారు. యాకమూరులో సేక రించిన చెత్త, వ్యర్థాలు పుల్లేరు కాల్వలో డంపింగ్ చేయడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న పరిస్థితుల్లో పొలాలకు సాగునీరందక రైతుల ఇబ్బందులు, చెత్తనీటిలో కుళ్లి దుర్గంధంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్న వైనాన్ని 'డంపింగ్ యార్డులా పుల్లేరు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ కంకిపాడు ఏఈ మణికంఠ స్పందించారు. సిబ్బందితో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యాకమూరు గ్రామ సచివాలయ సెక్రటరీ, ఉన్నతాధికారులకు నోటీసు జారీ చేస్తామన్నారు.

## ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత పనులు

**హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 3 :** బాపులపాడులో డ్రెయిన్ల పూడికతీత పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులుగా సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది పూడికతీత పనులు చేపట్టారు. శనివారం పంచాయతీ కార్యదర్శి సీహెచ్ ప్రసాద్ పర్యవేక్షణలో ఇందిరానగర్ కాలనీలోని ప్రధాన డ్రెయినేజీలో జేసీబీ సాయంతో పూడికతీత పనులు నిర్వహించారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 105, 116 |
| చికెన్ విత్ స్కిన్ | 180 |
| చికెన్ స్కిన్‌లెస్ | 190 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50



## ఎంపీ కేశినేని చిన్నికి ఎమ్మెల్యే వెనిగండ్ల జన్మదిన శుభాకాంక్షలు

**గుడివాడ :** విజయవాడ ఎంపీ కేశినేని చిన్నికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్లరాము జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ లోని ఆయన నివాసంలో వెనిగండ్ల కలిసి పుష్పగుచ్ఛమిచ్చి ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. చిన్ని మరిన్ని పుట్టినరోజులను జరుపుకోవాలని, ప్రజాజీవితంలో మరింత ముందుకు సాగాలని ఎమ్మెల్యే వెనిగండ్ల ఆకాంక్షించారు.



అమ్మవార్లకు ఆషాడసారె తీసుకువెళుతున్న మహిళలు

## ముత్యాలమ్మ, పైడమ్మ, శ్యామలాంబకు ఆషాఢ సారె

**పెడన :** ముత్యాలమ్మ, పైడమ్మ, శ్యామలాంబ అమ్మవార్లకు మహిళలు శనివారం ఆషాఢసారె సమర్పించారు. రామలింగేశ్వర స్వామి (భజన గుడి) ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి తొలుత ముత్యాలమ్మతల్లికి, అనంతరం పైడమ్మతల్లికి, శ్యామలాంబతల్లికి ఆషాఢ సారె సమర్పించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనందప్రసాద్, ఫ్లోర్ లీడర్ బళ్ళ గంగయ్య, మాజీ కౌన్సిలర్ కట్టా జ్యోతీశ్వరరావు, శ్యామలాంబ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు బొడ్డు దీక్షానందుడు, ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్వాహకుడు తోట పైడేశ్వరరావు, పైడమ్మతల్లి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం సంవృద్ధి సాధించాలి



**మచిలీపట్నం టౌన్ :** మహిళలు స్వయం సంవృద్ధి సాధించాలని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. స్థానిక 45 వడివిజన్ సచివాలయంలో శనివారం డ్వాక్రా మహిళలతో సమావేశం జరిగింది. గోపీచంద్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారన్నారు. సిటీ మిషన్ మేనేజర్ బసవేశ్వరరావు మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలు ఎప్పటికప్పుడు రుణాలు చెల్లిస్తూ కొత్తగా రుణాలు తీసుకోవాలన్నారు. టీడీపీ ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ మాట్లాడుతూ, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ వి.కృష్ణకుమారి, డ్వాక్రా గ్రూపు ఆర్‌పి ఎస్. ప్రభావతి, పి. సంధ్య, సచివాలయ అడ్మిన్ అల్లాభక్షు, కొండిశెట్టి వీరాంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## 50 మంది విద్యార్థుల రక్తదానం



**చల్లపల్లి :** శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్, చల్లపల్లి రాజా కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వివేకానంద డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం జరిగింది. చిగురుపాటి మంజువాణి..వరప్రసాద్ లయన్స్ బ్లడ్ బ్యాం కు ప్రతినిధులు రక్తసేకరణ చేశారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్(బ్లడ్ క్యాంప్స్) టి.సాంబశివరావు పర్యవేక్షణలో 50 మందికిపైగా రక్తదానం చేశారు. శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ పి.రమేష్‌బాబు, లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి వెంకట వరప్రసాద్, నర్రా సాయిబాబు, మోపిదేవి వెంకటేశ్వరరావు, కొల్లిపర మధు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గోవిందరాజుల అశ్వినీకుమార్, టీడీఆర్, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కస్తూరి విజయ్, చేతన్ తదితరులు పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు.

## గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా మల్లిఖార్జునరావు



**గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా టి.మల్లిఖార్జునరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. అమలాపురం నుంచి బదిలీపై టి.మల్లిఖార్జునరావు గుడ్లవల్లేరుకు వచ్చారు. రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



ఆరో నెంబరు కాల్వ పూడికతీతను పరిశీలిస్తున్న మండలి



బల్లిపర్రు దిగువ పూడికతీత పనుల పరిశీలన



రక్షిత నీటి పథకాన్ని పరిశీలిస్తున్న పిన్నెంటి

# డ్రెయిన్లు, కాల్వల్లో పూడికతీత

**• ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, కుమార్‌రాజా, కాగిత చొరవ**

అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ రైతుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. దీంతో అధికారులు స్పందించి డ్రెయిన్లు, కాల్వల్లో పూడికతీత పనులు శరవేగంగా చేస్తున్నారు. సాగునీటి సమస్యకు కొంత మేర పరిష్కారం లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కోడూరు :** పిట్టల్లంక, బడేవారిపాలెం, విశ్వనాథపల్లి రైతులతో కలిసి జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య ఆధ్వర్యంలో పంట కాల్వ పూడికతీత పనులు చేపట్టారు. విశ్వనాథపల్లి నుండి గాబ వెళ్లే ఆరో నెంబరు పంట కాలువ పూడికతీత పనులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శనివారం పరిశీలించారు. పిట్టల్లంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, తోట సోమశేఖరరావు, కోట రాంబాబు, పూతబోయిన కరుణకుమార్, పూతబోయిన సీతారత్న సాయి బాబు, తోట దామోదరరావు, కోలా వెంకటేశ్వరరావు, కాగిత రామారావు, దాసరి నాంచారయ్య, పరిశె నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు. ఎనిమిదో నెంబర్ పంట కాలువ పూడికతీత పనులను ఇరిగేషన్ ఏఈ విజయ్ కుమార్‌తో కలిసి డీఈ రావెళ్ల రవికిరణ్ పరిశీలించారు. సమతుల్యంతో రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **పామర్రు :** గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బల్లిపర్రు లాకు దిగువన కొత్తకోడు, పెదమద్దాలి పంట కాల్వల్లో గుర్రపు డెక్క, తూటుకాడతో పూడిపోయి సాగునీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. ఆయా గ్రామాల రైతులు సమస్యను ఎమ్మెల్యే కుమార్ రాజా దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలపై పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా ఇచ్చిన ఆదేశాలకు అధికారులు స్పందించారు. ఇరిగేషన్ డీఈఈ సూర్య భరత్, ఏఈ అరుణ్‌కుమార్ శనివారం ఎక్స్‌వేటర్‌తో పూడికతీత పనులను చేపట్టడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. బల్లిపర్రు సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్, తమ్మారెడ్డి సంజీవరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**ఏడో నెంబర్ పంట కాల్వలో..**

**చల్లపల్లి :** ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చొరవతో కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మేకావారిపాలెం గ్రామంలో ఏడో నెంబర్ పంట కాలువలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పనులను ఇరిగేషన్ ఏఈ జనార్దన్, ఎంపీటీసీ సభ్యుడు మేకా బంగారుబాబు, మంగళాపురం సర్పంచ్ నాగేశ్వరరావు, వేమూరి గోవర్ధన్, రంగారావు, మేకా శ్రీధర్ పరిశీలించారు.

### రైతుల్లో ఆనందం

**కృత్తివెన్ను :** శీతనపల్లి వద్ద మెగా రక్షిత మంచినీటి పథకం చెరువు, సంపులను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, కూటమి నాయకులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. రత్తయ్య మాట్లాడుతూ, ఈ ఏడాది ఆగస్టు తొలి వారంలోనే రైతులకు నీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి, ప్రభుత్వం రైతుల ప్రభుత్వంగా చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దాసరి బాలయేసు, పాలపర్తి ప్రకాష్, జేవియర్, శాంతయ్య, శ్రీనివాసరావు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి పెద్దపీట

**• ఎమ్మెల్యే కుమార్ రాజా**

**పామర్రు :** విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను ఎమ్మెల్యే కుమార్ రాజా ముఖ్యఅతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను కార్పొరేట్ కు ధీటుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నారన్నారు. కళాశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వల్లూరిపల్లి గణేష్, జక్కా శ్రీనివాసరావు, ఎంఈవో గుమ్మడి పద్మవాణి, చాట్ల రమేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పామర్రు, మొవ్వ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రి అందజేస్తున్న వర్ల

**క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి**

**కూచిపూడి :** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగపర్చుకుని లబ్ధి పొందాల్సిందిగా కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద శాస్త్రి, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, తహసీల్దార్ మస్తానరావు, లింగమనేని రామలింగేశ్వరరావు, తాతినేని పూర్ణచంద్రరావు, ఎంఈవో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మెదడు వాపు వ్యాధితో విద్యార్థిని మృతి



**కృత్తివెన్ను :** మెదడు వాపు వ్యాధితో పీతలావకు చెందిన టెన్త్ విద్యార్థిని తిరుమాని కావేరి శనివారం మృతి చెందింది. పీతలావ గ్రామానికి చెందిన తిరుమాని యేసుకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె తిరుమాని కావేరి (14) సంగమూడి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. నెల రోజుల క్రితం మెదడు వాపు వ్యాధి బారిన పడిన కావేరి గుంటూరు, విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందింది. కావేరి ఆరోగ్యం కోసం దాతలు ఎంతగానో సాయం చేసినా ప్రయోజనం లేకపోయింది. చదువులో ప్రతిభ కనబరిచే కావేరి చిన్న వయస్సులోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పెడన రూరల్ :** విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డి.ప్రదీప్‌కుమార్ అన్నారు. నందిగం పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు అందజేశారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. నీరసించిన రోగులను గుర్తించి గ్లూకోజ్ అందించారు. తాగునీటి బావులు, చెరువులలో క్లోరినేషన్ చేయించారు. మురుగునీటిగుంటలలో లార్వా పెరగకుండా ఎబేట్ స్ప్రే చేశారు. సర్పంచి బొడ్డు చినబాబు, సత్యనారాయణ, పైడేశ్వరమ్మ, లక్ష్మీకుమారి, ప్రభాకరరావు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మురాద్ బేగ్ చొరవతో ఆదరణ చెంతకు వృద్ధురాలు



**అవనిగడ్డ :** అనాథ ఉన్న వృద్ధురాలికి సహృదయులు ఆపన్న హస్తం అందించారు. కోర్టు సెంటర్‌లోని కంచి కామాక్షమ్మ గుడి వద్ద గత పది రోజులుగా గుర్తు తెలియని వృద్ధురాలు ఉంటోంది. స్థానిక వడ్రంగి మేస్త్రీ మొగల్ మురాద్ బేగ్ పది రోజులుగా ఆమె బాగోగులు చూస్తూ ఆమె కుటుంబసభ్యులు వస్తారని ఎదురు చూశారు. తన వ్యక్తిగత వివరాలు కూడా చెప్పలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి దీన స్థితి గురించి శనివారం చల్లపల్లి ఆదరణ గృహం వృద్ధాశ్రమం వారికి తెలియ జేశారు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు జంజనం రామ్మోహనరావు అవనిగడ్డ వచ్చి వృద్ధురాలిని ఆశ్రమానికి తరలించారు.

## ఎమ్మార్పీఎస్ సంబరాలు

**గుడ్లవల్లేరు :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తూ గుడ్లవల్లేరు, అంగలూరు గ్రామాల్లో సంబరాలు జరిపారు. గుడ్లవల్లేరు అంబేడ్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డప్పు కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. బుల్లా త్యాగరాజు(కింగ్), ప్రకాష్, కొడాలి సుధాకర్, రాయళ్ల ప్రభాకర్, పోలయ్య, పేరయ్య పాల్గొన్నారు.

## బాబూరావుకు వేదవ్యాస్ నివాళి



**కృత్తివెన్ను :** గరిశపూడి మాజీ సర్పంచ్ వల్లపు బాబూరావు ప్రథమ వర్ధంతి శనివారం గరిశపూడిలో జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు విగ్రహాన్ని మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ ఆవిష్కరించి నివాళులర్పించారు.

## ఐవీఎం సేవలు స్ఫూర్తిదాయకం : మంత్రి రవీంద్ర



**చల్లపల్లి :** ఐవీఎం సంస్థ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ వెలగపూడి సచివాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఐవీఎం ద్వారా చల్లపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు అందిస్తున్న సేవలు, కరోనా సమయంలో నియోజకవర్గంలోని ప్రజలకు, ఫ్రంట్ లైన్ వారియర్లకు అందించిన సహాయ కార్యక్రమాల ను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఐవీఎం డైరెక్టర్ సురేష్‌ను మంత్రి రవీంద్ర అభినందించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కరుణకుమార్ పాల్గొన్నారు.

## పంచాయతీ చెరువుల వేలం ఆదాయం రూ.12.84 లక్షలు

**చల్లపల్లి :** లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యాలయం లో శనివారం చెరువులకు బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్‌కుమార్, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఇన్‌చార్జి కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు వేలంపాటలు నిర్వహించారు. లక్ష్మీపురం, రామానగరం, చింతలమడ, నూకలవారిపాలెం గ్రామాల్లోని 10 చేపల చెరువులకు పాటలు నిర్వహించగా, మొత్తంగా రూ.12.84 లక్షలకు పాటలు ఖరారయ్యాయి. గతంలో ఈ చెరువుల ద్వారా రూ.10.23 లక్షల ఆదాయం లభించింది. రజక చెరువును రూ.37,500లకు సొసైటీకి కేటాయించారు. మూడేళ్ల కాలానికి వేలంపాటలు జరిగాయి.

## విద్యార్థిని జ్యోతిశ్రీ ప్రతిభ



**చల్లపల్లి :** నడకుదురు పంచాయతీ శివారు నాదెళ్ల వారిపాలెం గ్రామానికి చెందిన మేడేపల్లి జ్యోతిశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన జ్యోతిశ్రీ పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో 561 మార్కులను సాధించి హైస్కూల్‌లో ప్రథమశ్రేణిలో నిలిచింది. ట్రిపుల్ ఐటీకి రెండో విడతలో జరిగిన కౌన్సెలింగ్‌లో జ్యోతిశ్రీ ఎంపికైంది.

## వేంకటేశ్వరస్వామి ఆగమన మహోత్సవాలు 7 నుంచి

**మంటాడ (ఉయ్యూరు) :** మంటాడలోని అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేకంటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆగమన మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ ఈవో మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 35 మద్యం సీసాలు స్వాధీనం

**కోడూరు :** అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఎస్సై పి.శిరీష అదుపులోకి తీసుకున్నారు. కోడూరు బొమ్మల సెంటర్‌లో మద్యం తరలిస్తున్న వ్యక్తిని గుర్తించి 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

## మెగా రక్తదాన శిబిరం నేడు

**అవనిగడ్డ :** దివిసీమ గాంధీ, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ కోడూరు అధ్యక్షుడు పూతబోయిన సీతారత్న సాయిబాబు తెలిపారు.

అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి, లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు - దివిసీమ, గాంధీక్షేత్రం, రోటరీ క్లబ్ ఆఫ్ అవనిగడ్డ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ లయన్ చిగురుపాటి మంజువాణి బ్లడ్ బ్యాంక్ వారిచే స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4వ తేదీ ఉదయం 9.30 గంటలకు శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. యువత, రక్తదాతలు పెద్ద సంఖ్య లో పాల్గొనాల్సిందిగా కోరారు.



## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు చల్లపల్లి విద్యార్థులు

**చల్లపల్లి :** రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు చల్లపల్లి పవన్ తైక్వాండో జిమ్ సెంటర్ విద్యార్థులు ఎ.కార్తికేయ, ఎ.హేమరాజు, వై.అఖిల్, టి.శివబాలాజీ ఎంపికయ్యారు. విజయవాడ లయోలా కళాశాలలో జరిగిన అండర్ - 14, అండర్ - 11 జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు బంగారు పతకాలు సాధించి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ కందుల పవన్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభినందించారు. యన్నం వెంకటేశ్వరరావు ఉన్నారు.

## విక్కుర్తి ఆర్థిక సాయం

**కోడూరు :** ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు షుగర్ వ్యాధితో బాధపడుతున్న హంసలదీవికి చెందిన తమ్ము నాంచారయ్యకు ఆర్థిక సాయమందించారు. నాంచారయ్య కాలుకి దెబ్బ తగిలి గాయం కాగా, సర్జరీ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆయన శ్రీనివాసరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. రేపల్లె ప్రతాప్ పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్యశిబిరం

**అవనిగడ్డ రూరల్ :** గ్రామీణ వ్యవస్థకు పాడి పంటలే పట్టుగొమ్మలని మండలి వెంకట్రామ్ అన్నారు. కొత్తపేట, రామకోటిపురం గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండలి వెంకట్రామ్ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. 60 పశువులకు వ్యాధి నిర్ధారణ, చికిత్స, 200 మేకలకు నట్టల నివారణ, 10 ఆవులు, 50 గేదెలకు వైద్యం అందించారు. ఉత్తమ పాడి రైతులకు బహుమతులు అందజేశారు. పశు సంవర్ధక శాఖ అధికారులు, అధ్యక్షుడు శేషుబాబు, ఎంపీటీసీ సభ్యుడు భాను పాల్గొన్నారు.



## అగ్నిబాధితులకు నాంచారయ్య ట్రస్టు సాయం

**ఘంటసాల :** ఘంటసాలలోని ఎస్టీ కాలనీ అగ్నిబాధిత నాలుగు కుటుంబాలకు అంబేడ్కర్ నగర్‌కు చెందిన గొరుముచ్చు నాంచారయ్య ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత అరుణ్ కుమార్ - లలిత దంపతులు గ్యాస్ స్టవ్‌లు, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. దైవజనులు గుడిసేవ ప్రదీప్ కుమార్, కొడాలి చిన్నా, కావూరి సతీష్ పాల్, కొడాలి లారెన్స్, కావూరి మనోజ్, దినేష్, శ్యామ్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**కూచిపూడి :** మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజన్ ఉదయ్ ప్రకాష్ సూచించారు. మొవ్వ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, దానిని రూపు మాల్చిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంలోని హక్కులు, విధులను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రసాద శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అగ్నిబాధితులకు కుమార్‌రాజా ఆర్థిక సాయం

**పమిడిముక్కల :** గుర్రాలలంక రెండు అగ్నిబాధిత కుటుంబాలకు రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా శనివారం అందజేశారు. అన్నప్పరెడ్డి అయ్యప్ప, రాజ్యలక్ష్మి కుటుంబాలను ఆయన పరామర్శించారు. అన్నప్పరెడ్డి అయ్యప్పకు రూ. 17,000, రాజ్యలక్ష్మికి రూ. 3వేలు నగదు సహాయం అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, నాదెళ్ల సుబ్రమణ్యం, వెంకటేశ్వరరావు, గోపాల కృష్ణ, దామెర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన

**కోడూరు :** కోడూరు లెజెండ్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎనిమిదో జాబ్‌మేళా కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సంస్థ అధ్యక్షుడు పూతబోయిన అయ్యప్ప స్వామి ఆధ్వర్యంలో ‍ శ్రీ దానా శక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మం దిరంలో టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 76 మంది నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొన్నారు. వీరిలో 38 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, ఎంపికైన వారికి 45 రోజులపాటు హైదరాబాద్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని పూతబోయిన అయ్యప్ప స్వామి తెలిపారు. టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ సునీల్, లెజెండ్ సోషల్ సర్వీస్ సభ్యులు బడే నాని, బడే జయకిషోర్, మాచర్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముఠా కార్మికులపై ప్రభుత్వ ఒత్తిడి విరమించాలి

**గుడివాడ :** ముఠా కార్మికులపై ప్రభుత్వ అధికారులు ఒత్తిడి విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు ఇఎస్ఐ, పీఎఫ్‌లను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

**కృత్తివెన్ను :** ఎంఎస్ఆర్ ఫ్యామిలీ సెలూన్ ట్రైనింగ్ ఏకాడమీ లక్ష్మీపురం ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసిన మహిళకు సర్టిఫికెట్లు అందజేశారు. కూటమి నాయకులు పులగం పెద్దబ్బులు, కొప్పత్తి రంగారావు, తిరుమాని రామాంజనేయులు తదితరులు సర్టిఫికెట్లు అందజేశారు.



## ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వ సేవలు

**పెడన :** హోం బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో -ఆర్డినేటర్ కె. రాములు నాయక్ శనివారం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి ఇంటిని సందర్శించారు. ప్రభుత్వ అందిస్తున్న సేవలను వివరించారు. రామకృష్ణ, జి. సీతామహాలక్ష్మి కె. నవీన్, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.